# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేదీ : 22-02-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు మిర్చి ధరలపై అధికారులు, వ్యాపారులతో సమీక్ష నిర్వహించనున్నారు.**

**2.** **రాష్ట్రంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలును పారదర్శకంగా నిర్వహించామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**

**3.** **ఇంటర్మీడియట్ పరీక్షల హాల్‌టికెట్లను 'మనమిత్ర' వాట్సప్ ద్వారా కూడా పొందవచ్చని ఇంటర్మీడియట్ విద్యామండలి వెల్లడించింది.**

**4.** **ప్రముఖ స్వాతంత్రసమరయోధులు, దేశభక్త బిరుదాంకితులు కొండా వెంకటప్పయ్య జయంతి ఈ రోజు.**

**5.** **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

==========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి ఈరోజు పలు ప్రభుత్వ శాఖలపై సమీక్ష నిర్వహించనున్నారు. ఈ మధ్యాహ్నం మిర్చి ధరలు, ఎగుమతుల అంశంపై మిర్చి వ్యాపారులు, అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తారు. అనంతరం రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ–సిఆర్డిఎపై సమీక్ష నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొననున్నారు.

--------------------------

రాష్ట్రంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలును పారదర్శకంగా నిర్వహించామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం భవనాన్ని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..

..వాయిస్...22 సెకన్లు...

--------------------------

ఇంటర్మీడియట్ పరీక్షల హాల్‌టికెట్లను బోర్డు వెబ్‌సైట్‌తోపాటు 'మనమిత్ర' వాట్సప్ ద్వారా కూడా

పొందవచ్చని ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి కృతికా శుక్లా తెలిపారు. కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల హాల్‌టికెట్లను నిలుపుదల చేసి ఒత్తిడి కలుగచేయకుండా ఉండేందుకు వీలుగా ఈ వెసులుబాటు కల్పించినట్టు ఆమె వెల్లడించారు. వాట్సప్ నంబరు 95523 00009కు విద్యార్థులు వారి ఫోన్ నుంచి హాయ్ అని సంక్షిప్త సమాచారం అందచేస్తే వచ్చే లింకు ద్వారా ఇతర వివరాలను అందచేసి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె సూచించారు.

---------------------------

ప్రముఖ స్వాతంత్రసమరయోధులు, దేశభక్త బిరుదాంకితులు కొండా వెంకటప్పయ్య జయంతి ఈ రోజు. 1866 ఫిబ్రవరి 22న గుంటూరులో కొండా వెంకటప్పయ్య జన్మి చారు. భాషా ప్రాతిపదిక మీద రాష్ట్రాల విభజన అవసరాన్ని ఉద్ఘాటించిన ఆంధ్రులలో కొండా వెంకటప్పయ్య ఆద్యులు. నెల్లూరులో జరిగిన ఆంధ్ర మహాసభకు కొండా వెంకటప్పయ్య అధ్యక్షులుగా ఎన్నికై ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి ఒక నిర్దిష్ట కార్యక్రమం రూపొందించారు. ఆంధ్రా ఖద్దరుకి యావద్దేశంలో ప్రచారం లభించడానికి ఆయన చేసిన కృషి ప్రధానమైనది. గాంధీజీ తలపెట్టిన ప్రతి ఉద్యమానికి ఆంధ్రలో నాయకత్వం వహించిన వెంకటప్పయ్య 1949 ఆగస్ట్ 15వ తేదీన కన్నుమూశారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 119వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

దేశ ఆర్థిక వ్యవస్థకు దోహదపడేలా కేంద్ర బడ్జెట్ ఉందని జమ్మలమడుగు శాసనసభ్యులు సిహెచ్.ఆదినారాయణ రెడ్డి తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిన్న కేంద్ర బడ్జెట్‌పై జిల్లా మేధావులతో నిర్వహించిన చర్చ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ....దేశంలో 4లక్షల 50 వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉందని చెప్పారు. మరో మూడేళ్ళలో ఐదు లక్షల మెగావాట్ల విద్యుత్తు అందుబాటులోకి రానుందని తెలియజేస్తూ,

వాయిస్... 33 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు అభినందనీయమని జర్మనీ ప్రతినిధుల బృందం ప్రశంసించింది. రాష్ట్రంలోని గుంటూరు, కృష్ణా, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం ఏపీసీఎన్ఎఫ్ ద్వారా అమలుచేస్తున్న కార్యక్రమాలను ఈ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా విజయవాడలో నిన్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో జర్మనీ బృందం సమావేశమైంది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయాన్ని చిన్న, సన్నకారు రైతులు కూడా అవలంబించడం ప్రశంసనీయమన్నారు.

---------------------------

తిరుపతి జిల్లాలో బర్డ్ ఫ్లూ ప్రభావం లేదని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్.ఎ.రవికుమార్ తెలిపారు. తిరుపతిలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, బర్డ్ ఫ్లూపై ప్రజలు ఎలాంటి ప్రచారాలను నమ్మవద్దని కోరారు. ఉడికించిన చికెన్, గుడ్లను తినవచ్చని ఆయన సూచిస్తూ,

వాయిస్ ...32 సెకన్లు

---------------------------

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి వేంకటేశ్వర ప్రసాద్ అన్నారు. అనంతపురంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రంలో టమోటా పంటకు గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంతో ప్రభుత్వమే పంటను కిలో 8 రూపాయల చొప్పున కొనుగోలు చేసి, రైతు బజార్ల ద్వారా తక్కువ ధరకే విక్రయించేలా ప్రణాళికలు సిద్ధం చేసిందని అన్నారు. టమోటా కొరత ఉన్న తమిళనాడు, తెలంగాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలో విక్రయించడానికి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించినట్టు వివరించారు.

---------------------------

నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నాల్గవ రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఈ ఉదయం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం, ఈ సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానాలు శ్రీ స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నాయని ఆలయ అధికారులు తెలిపారు. కాగా ఈ రోజు సాయంత్రం మయూర వాహనంపై స్వామి అమ్మవార్లు దర్శనమివ్వనున్నారు.

---------------------------

భారత దేశ విద్యారంగాభి వృద్ధికి బాటలు వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి ఈ రోజు. ఈ సందర్భంగా దేశ ప్రజలు ఆయనకు ఘనంగా నివాళులు అర్పిస్తున్నారు. 1888 నవంబర్ 11వ తేదీన మక్కాలో జన్మించిన ఆజాద్ కేంద్ర విద్యాశాఖ మంత్రిగా సుదీర్ఘకాలం సేవలు అందించారు. విద్యారంగానికి ఆజాద్ చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆయనను భారతరత్న పురస్కారంతో సత్కరించింది. 1958 ఫిబ్రవరి 22 వ తేదీన ఆజాద్ తుది శ్వాస విడిచారు.

=====================